క్లుప్తంగా

ఈనెల 29 నుంచి 31 వరకు ప్రజాభిప్రాయ సేకరణ

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) మధ్యప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాల రిటైల్ ధరలకు సంబంధించి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ నెల 29, 30, 31 తేదీలలో జరుగుతుందని మాచర్ల విద్యుత్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఔ.హరిబాబు, డీఈ ఎ.రామయ్యలు గురువారం తెలిపారు. రాష్ట్రంలోని అన్ని విద్యుత్ సర్కిల్ డివిజనల్ కార్యాలయాలలో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించటం జరుగుతుందన్నారు. మూడు రోజులపాటు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అనంతరం 2 నుంచి 4.30 గంటల వరకు నిర్వహించటం జరుగుతుందని, కావున మాచర్ల డివిజన్‌లో జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు విద్యుత్‌శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రహదారులే అభివృద్ధికి సోపానాలు



రెంటచింతల: గ్రామీణ ప్రాంతాలలో నున్న రహదారులే అభివృద్ధికి సోపానాలని వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక అంథోనివారి కాలనీలో రూ.12.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన పార్టీ నాయకులు, అధికారులతో కలిసి భూమి పూజలో పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్రంలో అభివృద్ధి పనులకు సమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పేర్ల చౌడమ్మ, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు పల్లెర్ల శ్రీనివాస రెడ్డి, తుమ్మా పాపిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉమ్మా రామాంజనేయరెడ్డి, పార్టీ నాయకులు పేర్ల ముత్తయ్య, పల్లెర్ల లక్ష్మారెడ్డి, పల్లెర్ల కోటిరెడ్డి, గంజి బాలరెడ్డి, గాదె కిరీటి రెడ్డి, కార్యదర్శి జి.అనంత కోటేశ్వరరావు తదితరులున్నారు.

అంబేడ్కర్ ఆశయాలు అనుసరణీయం



సత్తెనపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ని స్ఫూర్తిగా తీసుకొని ఉన్న స్థితి నుంచి ఉన్నతమైన స్థాయికి ఎదగాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కోఆర్డినేటర్ బి.రమణమూర్తి విద్యార్థులకు సూచించారు. సత్తెనపల్లి మండలం కట్టమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా భారత రాజ్యాంగ ప్రవేశిక ముఖ్యాంశాలపై ఫోటో ప్రదర్శన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు తమకు ఇష్టమైన మతాన్ని, ఆచారాలను అనుసరించడానికి రాజ్యాంగం హక్కులు, అవకాశాలు కల్పించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు టీవీ బహూకరణ

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు అవసరమైన టీవీని వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ గురువారం బహూకరించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ గతంలో 16 సీసీ కెమెరాలు ఉండేవని, ప్రస్తుతం వాటిని 50 సీసీ కెమెరాలకు పెంచడం జరిగిందన్నారు. సీసీ కెమెరాలను వీక్షించేందుకు ఓ పెద్దపాటి టీవీ అవసరం కాగా స్పందించిన వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ టీవీని సమకూర్చారన్నారు. కొత్త రామకృష్ణ మాట్లాడుతూ వైద్యశాలలో ఒకప్పుడు పర్యవేక్షణ లోపం ఉండేదన్నారు. ఇప్పుడు ప్రతి వార్డుకి సీసీ కెమెరా అమర్చడం వల్లన ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినా సీసీ కెమెరాలో నిక్షిప్తం అవుతుందన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, ఏవో గంగాభవాని, తదితరులున్నారు.

మహిళ ఆత్మహత్య

కారెంపూడి: మండల పరిధిలోని మతుకుమల్లి గ్రామంలో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని చింతల బీడు బీసీ కాలనీకి చెందిన సీహెచ్ జ్యోతి ప్రసన్న (38) బుధవారం సాయంత్రం చీరతో ఫ్యానుకు ఉరేసు కుని ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఉదయం సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, సీడీపీవో ముదివర్తి అనురాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత పంచాయతీ కార్యదర్శి సూరిబాబు నివాళి అర్పించారు. వ్యక్తిగత కారణాల వల్లే జ్యోతి ప్రసన్న ఆత్మహత్యకు పాల్పడినట్లు కుమారులు వెల్లడించారు.

మా ఊరి సేవాలయాలు



ఓబులేశునిపల్లెలోని రైతు భరోసా కేంద్రం



సచివాలయం



డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్

- నేడు ప్రారంభానికి సిద్ధం
- హాజరుకానున్న ప్రభుత్వ విప్ పీఆర్కే
- రూ.84.02 లక్షల వ్యయంతో నిర్మాణాలు పూర్తి

దుర్గి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రికలైన గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. గ్రామీణ ప్రజానీకానికి అవసరమైన అన్ని వసతులతో అత్యాధునికంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రజల వినియోగానికి అందుబాటులోకి రానున్నాయి. మండలంలోని ఓబులేశునిపల్లె గ్రామ పరిధిలో రూ.84.02 లక్షల వ్యయంతో వీటిని నిర్మించారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్ ఆవిష్కృతం చేశారు. అంతేకాకుండా ఈ వ్యవస్థ ద్వారా ఊరు దాటకుండా 544కుపైగా పౌర సేవలు అందుబాటులోకి రానున్నాయి. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నేతృత్వంలో ఘనంగా ప్రారంభం కావటానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నిర్మాణాలతో గ్రామానికి కొత్త శోభ సంతరించుకుంది. మాచర్ల ప్రధాన రహదారి వెంట 40సెంట్ల విస్తీర్ణంలో సచివాలయానికి రూ.40లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.23.94 లక్షలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కి రూ.20.08 లక్షలు వ్యయంతో నిర్మాణాలు పూర్తి చేశారు. ఓబులేశునిపల్లె పంచాయతీతో పాటు రాజానగరం పంచాయతీ పరిధిలోని ప్రజలకు కూడా వీటి సేవలు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అసలైన గ్రామ స్వరాజ్యం ఇదేనని నిరూపించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఓబులేశునిపల్లె, రాజానగరం గ్రామాల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 400 మందికి పైగా నిరుపేదలకు భూమి పట్టాలను పంపిణీ చేయటానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.




సీఎం జగన్‌కు కృతజ్ఞతలు..



అన్ని పౌర సేవలు, పేద ప్రజల ఆరోగ్యం కోసం ఆరోగ్య కేంద్రం, రైతుల కోసం రైతు భరోసా కేంద్రం తమ గ్రామంలోనే లక్షలాది రూపాయలు వెచ్చించి, ప్రజా సమస్యలు గ్రామంలోనే పరిష్కారం అయ్యే విధంగా సిబ్బందిని ఏర్పాటు చేసి నిజమైన అభివృద్ధి అంటే ఇదేనని చాటి చెప్పిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, సీఎం జగన్‌కి, ప్రభుత్వ విప్ పీఆర్కేకి గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

– ఉన్నం వెంకటేశ్వర్లు, సర్పంచ్, ఓబులేశునిపల్లె

ఇది కలగా ఉంది..



మా గ్రామంలో ఇంత పెద్ద ఎత్తున నిర్మాణాలను చేపట్టి, ప్రభుత్వ ఉద్యోగులను నియమించి మాకు మా గ్రామంలోనే ఏ అవసరమున్నా గ్రామ సచివాలయాలు అందుబాటులోకి రానుండటం చాలా సంతోషంగా ఉంది. గతంలో ఏ ప్రభుత్వం చిన్నపాటి గదులనూ నిర్మించిన దాఖలాలు లేవు. ఈ నిర్మాణాలతో మా ఊరు రూపురేఖలు మారాయి. ఇంత మంచి ప్రభుత్వాన్ని గతంలో నేను చూడలేదు.

– తాళ్ళూరి మల్లయ్య, గ్రామస్తుడు, ఓబులేశునిపల్లె

సీఎం జగన్‌కు అభినందనలు..



మా గ్రామంలోనే సచివాలయాలు ఏర్పాటు చేసి అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందే విధంగా ఏర్పాటు చేసిన సీఎం జగన్‌కు అభినందనలు. గతంలో ఈ సేవల కోసం మండల కేంద్రానికి వెళ్లి కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగటమే కాకుండా, డబ్బులు వృథా కావటం, రోజు పనులు కూడా చేసుకోలేక ఇబ్బంది పడటం వలన చాలా నష్టపోయాం. సీఎం జగన్ మాకు అందుబాటులోకి ప్రభుత్వ సేవలను తీసుకురావటం చాలా సంతోషకరం.

– జక్కా లక్ష్మీతిరుపతమ్మ, గ్రామస్తురాలు, గజాపురం

కొనసాగుతున్న కుల గణన సర్వే



ముటుకూరులో కుల గణన నిర్వహిస్తున్న వీఆర్వో సునీత, సిబ్బంది



కుల గణన సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్

దుర్గి: ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి కుల గణన కార్యక్రమాన్ని రెవెన్యూ సిబ్బంది వేగంగా నిర్వహిస్తున్నారు. గురువారం మండలంలోని ముటుకూరు గ్రామంలో స్థానిక వలంటీర్ల సహాయంతో వీఆర్వో సునీత ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. మండలంలోని అడిగొప్పల, ఓబులేశునిపల్లె, దుర్గి, కోలగుట్ల, ఆత్మకూరు, తేరాల, పోలేపల్లి, ధర్మవరం గ్రామాలలో వలంటీర్ల సహాయంతో రెవెన్యూ సిబ్బంది వివరాలను నమోదు చేస్తున్నారన్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలో కుల గణన సర్వే కొనసాగుతుంది. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని 33 వార్డులలో 17 సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి 58.8 శాతం పూర్తి చేయటం జరిగిందని తెలిపారు. శుక్ర, శనివారాల్లో సర్వే పూర్తి అయ్యే అవకాశం ఉందని తెలియజేశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన తెలిపారు.

రహదారి భద్రత అందరి బాధ్యత

- కేసీపీ భద్రతకు మొదటి ప్రాధాన్యతనిస్తుంది
- ఎంవీఐ శేషురెడ్డి, జీఎం వెంకటరమణ



కేసీపీ ఆడిటోరియంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంవీఐ శేషురెడ్డి, కేసీపీ జీఎం వెంకటరమణ

మాచర్ల: జాతీయ భద్రతా వారోత్సవాలు ఎంతో ముఖ్యమైన కార్యక్రమమని, ప్రతి ఒక్కరి జీవితాన్ని భద్రతగా ఉంచుకొని ఉద్యోగ బాధ్యతలు నిర్వహించేందుకు భద్రత సూచనలు చేసేందుకే జాతీయ భద్రతా మహోత్సవాలు నిర్వహించటం జరుగుతుందని మాచర్ల మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ డి.శేషురెడ్డి అన్నారు. గురువారం కేసీపీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ 35వ రహదారి భద్రతా మహోత్సవాలను పురస్కరించుకొని కేసీపీ జీఎం వెంకటరమణతో కలిసి జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేసీపీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన జాతీయ భద్రతా వారోత్సవాల ప్రాధాన్యత గురించి వివరించారు. కేసీపీ సంస్థ భద్రతకు ఎంతో ప్రాముఖ్యతనిస్తూ కార్మికులకు అనేక హక్కులు కల్పించటం అభినందనీయమన్నారు. కేసీపీ జీఎం వెంకటరమణ మాట్లాడుతూ తమ సంస్థ భద్రత, నాణ్యతకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, ఎక్కడా రాజీపడకుండా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో కేసీపీ హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీనివాసరావు, ఏజీఎం రామకోటేశ్వరరావు, సజ్జా వెంకటేశ్వరరావు, వెల్ఫేర్ వెంకటేశ్వరరావు, ప్రసాద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందుతున్న సజ్జా వెంకటేశ్వరరావును పలువురు సత్కరించి అభినందించి చెక్కును అందజేశారు.

రోడ్డు విస్తరణ జరిగినా తీరని ట్రాఫిక్ సమస్య

- రోడ్డుపైనే నిలిపి ఉంచుతున్న ఆటోలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు



రోడ్డుపైనే నిలిపివేస్తున్న ఆటోలు

పిడుగురాళ్ల: నడిరోడ్డుపై ఆటోలు నిలిపివేయటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. పిడుగురాళ్ల పట్టణంలో రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ, ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి కల్పించేందుకు గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా నిర్వహించారు. రోడ్డు అయితే వెడల్పు చేశారు కానీ ట్రాఫిక్ నిబంధనలు వాహనదారులు పాటించటం లేదు. నిరంతరం వాహనాలతో రద్దీగా ఉండే ఐలాండ్ సెంటర్, జానపాడు రోడ్డు, హైస్కూల్ సెంటర్, బ్యాంక్ సెంటర్లతోపాటు ఐలాండ్ సెంటర్‌లోని దుకాణాల వద్ద నడిరోడ్డుపై వాహనాలు నిలపటంతో వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఇలాగే ప్రచారి హోల్ సెల్‌దుకాణాల వద్ద రాత్రి సమయాల్లో వాహనాల నుంచి లోడు, అన్‌లోడు చేస్తే ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఉండవు. నిరంతరం వాహనాల రాకపోకతో రద్దీగా ఉండే ప్రధాన రహదారిలో వాహనాలు నిలపటం, లోడు వాహనాలు రోడ్డుకు అడ్డంగా ఉండటం, చిరువ్యాపారులైన తోపుడు బండ్ల వారు గత్యంతరం లేక రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పట్టణ ప్రజలు అంటున్నారు.

ట్రాఫిక్ సమస్యకు చర్యలు..



ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు ఐలాండ్ సెంటర్, హైస్కూల్ ప్రాంతాల్లో బారికేడ్లను ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ఆటోవాళ్లకు కూడా కౌన్సెలింగ్ ఇచ్చి ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపడతామని అన్నారు. ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తమ సిబ్బంది ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారన్నారు.

– పట్టణ సీఐ అంజనేయులు

ఘనంగా ఓటర్ల దినోత్సవం



శిరిగిరిపాడులో ఓటర్ల దినోత్సవ ర్యాలీలో అధికారులు, నాయకులు, విద్యార్థులు, గ్రామస్తులు



గురజాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో, తహసీల్దార్



సీనియర్ సిటిజన్‌ను సన్మానిస్తున్న బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది

వెల్దుర్తి: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని తహసీల్దార్ కోటేశ్వరరావు నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని శిరిగిరిపాడులో ఓటర్ల దినోత్సవ ర్యాలీని విద్యార్థులతో కలిసి గ్రామ వీధుల్లో నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు అర్హులేనన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం లాంటిదన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, గ్రామ సర్పంచ్ చపారపు లచ్చిరెడ్డి, డీటీ రాజశేఖర్ నాయక్, సచివాలయ సిబ్బంది, బీఎల్‌ఓలు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవటం మన బాధ్యత

దుర్గి: ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని సీనియర్ సిటిజన్ మంగళగిరి సత్యనారాయణ శాస్త్రి అన్నారు. గురువారం మండల కేంద్రమైన దుర్గిలోని జెడ్పీహెచ్ స్కూల్‌లో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. గడచిన ఎన్నికలలో ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్స్‌ను రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు సత్కరించారు. మండల వ్యాప్తంగా గ్రామ సచివాలయాలలో ఓటర్ల దినోత్సవాన్ని గ్రామస్తులు, బీఎల్‌ఓలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్లు నిర్మల, రత్న ప్రకాష్, బీఎల్‌ఓలు మేరుగ కిరణ్, కోటేశ్వరరావు, ప్రకాష్, కరిముల్లా, అనిల్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

దాచేపల్లి : అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని గురజాల ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురజాల, దాచేపల్లిలో గురువారం జరుపుకున్నారు. గురజాల ఆర్డీవో కార్యాలయం వద్ద నుంచి విద్యార్థులతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా కల్పించిన ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని, ఓటు హక్కు ద్వారా మనకు నచ్చిన నేతను ఎన్నుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు మీసాల దానియేలు, గుజ్జర్లపూడి కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బీఎల్‌వో నాసర్‌రెడ్డి



రెంటచింతల: మండలంలోని గోలి గ్రామ బీఎల్వోగా విధులు నిర్వహిస్తున్న పాశం నాసర్‌రెడ్డి ఉత్తమ బీఎల్వోగా జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం జిల్లా కేంద్రం నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. గోలి గ్రామంలో 218 పోలింగ్ బూత్ అధికారిగా నాసర్‌రెడ్డి ప్రభుత్వ, ఎన్నికల నియమ నిబంధనలు మేరకు ఓటర్ల జాబితా తయారీలో అంకిత భావంతో పని చేసినందుకు ఈ అవార్డు పొందినట్లు తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు తెలిపారు. అవార్డు గ్రహీత నాసర్‌రెడ్డిని స్థానిక రెవెన్యూ అధికారులు అభినందించారు.

బిగ్ హెల్ప్ సంస్థ రాష్ట్ర ఏఈడీగా భాస్కరబాబు

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఏఈడీ)గా తాటి భాస్కరబాబును నియమిస్తున్నట్లు ఎన్‌ఆర్‌ఐ, బిగ్ హెల్ప్ సంస్థ చైర్మన్ షేక్ చాంద్‌బాషా గురువారం తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 27 ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులను దత్తత తీసుకొని అనేక సంవత్సరాలుగా వివిధ కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టు మొత్తాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పర్యవేక్షించేందుకు ఉత్తమ ఉపాధ్యాయుడైన మాచర్లకు చెందిన తాటి భాస్కరబాబును నియమించటం జరిగిందని చాంద్‌బాషా తెలిపారు.

నేడు మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ

సత్తెనపల్లి: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ స్వర్గీయ కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు పట్టణంలో జరుగుతుందని ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం పట్టణ అధ్యక్షుడు శింగరి మధుసూదన్‌రావు గురువారం తెలిపారు. విగ్రహావిష్కరణను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభిస్తారన్నారు. సభాధ్యక్షులుగా మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి వ్యవహరిస్తారన్నారు. విగ్రహావిష్కరణకు నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, విజయవాడ శాసనసభ్యుడు వెల్లంపల్లి శ్రీనివాసరావు, గుంటూరు పశ్చిమ శాసనసభ్యుడు మద్దాలి గిరిధర్, ఎన్విరాన్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గుబ్బా చంద్రశేఖరరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడొట్టి మురళి మోహన్, పక్కాల సూరిబాబు, డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, డాక్టర్ గీతహాసంతి, ఏపీ గోల్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కపిలవాయి విజయ కుమార్, స్థానిక నాయకులు హాజరవుతారన్నారు.